నాలా పూడికతీత పనులు పూర్తిచేయాలి : బలాల



నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల, కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి

సైదాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని నాలాల్లో పూడికతీత, చెత్త తొలగింపు పనులను తక్షణమే పూర్తి చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులకు సూచించారు. బుధవారం సైదాబాద్ డివిజన్, శంకేశ్వర్ బజార్, సాయిరాంనగర్‌లో నాలాలను కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డితో కలిసి పరిశీలించారు. వరద ముంపు ఏర్పడకుండా నాలాల పనులపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



సావర్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

హిందూవాద అభివృద్ధికి సావర్కర్ కృషి

● బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మన్సూరాబాద్, మే 28(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య సమరంలో పోరాడడమే కాకుండా హిందూ జాతీయవాదాన్ని అభివృద్ధి చేసిన మహనీయుడు వినాయక్ దామోదర్ సావర్కర్ అని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. వీర సావర్కర్ జయంతిని పురస్కరించుకుని బుధవారం మన్సూరాబాద్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరంలో, హిందూ మహాసభ రాజకీయ పార్టీని స్థాపించి హిందూ జాతీయవాదాభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి నందికొండ గీతారెడ్డి, బొమ్మ రఘురాంనేత, గుండెల కిరణ్‌కుమార్, నేరెంకి రవి, పద్మారెడ్డి, కవిత, రాధిక, భారతి పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్



కమిషనర్ కర్ణన్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

చంపాపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని ఆయా కాలనీలలో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.5కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతా నాయక్ బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని ఆయా కాలనీలలో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం కోసం వెంటనే నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ కమిషనర్‌ను కోరారు. నిధుల మంజూరుకు కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చాదర్‌ఘాట్, మే 28(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని బ్యాండ్ బస్తీలో నూతన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. బ్యాండ్ బస్తీవాసుల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా వీలైనంత త్వరగా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. బస్తీలో మౌలిక సదుపాయాల కల్పనలకు అత్యధిక ప్రాధాన్యత నిస్తున్నట్లు ఆమె వివరించారు. జీహెచ్‌ఎంసీ ఏఈ శరత్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, సైట్ ఇంజనీర్ ఏడుకొండలు, బస్తీవాసులు భరత్, క్రాంతి, గిరిజ, అనద్, ఆరీఫ్ పాల్గొన్నారు.



ఫాగింగ్ పైలట్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్

దోమలపై దండయాత్ర

ఎల్‌బీనగర్, మే 28(ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీలలో దోమల బెడద నివారించేందుకు జీహెచ్‌ఎంసీ దోమలపై దండయాత్ర ప్రారంభించింది. అందులో భాగంగా కాలనీలు, బస్తీలలో ఫాగింగ్ చేయాలని నిర్ణయించింది. ఫాగింగ్ పైలట్ ప్రోగ్రాంను సరూర్‌నగర్ డివిజన్‌లో కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో దోమలు వృద్ధిచెంది ప్రజలు ఇబ్బందిపడకుండా ఉండేందుకు ఇప్పటి నుంచే ముందు జాగ్రత్తలు తీసుకుని దోమలను లార్వాదశలోనే అరికట్టాలని ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. నీరు నిలువ ఉండే ప్రాంతంలో దోమల మందు పిచికారి చేస్తారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు జైన్‌బాబు, కబీర్‌దాస్, ఎంటమాలజీ ఏఈ రాంబాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

35 ఏళ్ల ఆప్యాయత పలకరింపులు..

● కవాడిపల్లి జడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అబ్దుల్లాపూర్‌మెట్, మే 28(ఆంధ్రజ్యోతి): ఆ పూర్వ విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత మళ్లీ అదే స్కూల్‌లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆప్యాయతగా పలకరించుకుని యోగక్షేమాలు పంచుకున్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో 1990 నుంచి 1994 వరకు చదువుకున్న విద్యార్థులు బుధవారం ఆ స్కూల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా అప్పట్లో విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.



సరూర్‌నగర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



వనస్థలిపురం పనామా చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న టీడీపీ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు విజయ్ నేత, టీడీపీ నాయకులు



చంపాపేట గాంధీ చౌరస్తాలో టీడీపీ జెండాను ఎగురవేస్తున్న డివిజన్ ఉపాధ్యక్షుడు సంతోష్‌గౌడ్



పనామా చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న టీడీపీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, టీడీపీ నాయకులు

ఘనంగా ఎన్టీఆర్ జయంతి



వనస్థలిపురం పనామా చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, చింతల రవికుమార్ తదితరులు

వనస్థలిపురం, మే 28 (ఆంధ్రజ్యోతి): భారత సినీ రంగంలో తిరుగులేని విలక్షణ నటుడిగా, ఆదర్శ రాజకీయ నాయకుడిగా ప్రపంచ స్థాయిలో తనదైన ముద్రవేసుకుని తెలుగుజాతి గర్వపడేలా కీర్తి తెచ్చిన కెరటం పద్మశ్రీ, నందమూరి తారకరామరావు అని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు అన్నారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని బుధవారం వనస్థలిపురం పనామా చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ సీఎం, దివంగత నందమూరి తారక రామారావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు, అశోక్‌గౌడ్, టీడీపీ డివిజన్ అధ్యక్షులు వెలగ చంద్రశేఖర్, గద్దె విజయ్ నేత, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, ఉమా శ్రీనివాస్, కటికరెడ్డి అరవింద్ రెడ్డి, చింతల రవికుమార్, కుట్ల నర్సింహయాదవ్, వేములయ్యగౌడ్ పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ నర్సింహారెడ్డి, నేతలు

సరూర్‌నగర్‌లో..

ఎల్‌బీనగర్: ఎన్టీఆర్ జయంతిని సరూర్‌నగర్‌లో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. సరూర్‌నగర్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుజాతికి ఎన్టీఆర్ చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆకారం విజేందర్, ఎంవీవీ రమేష్‌బాబు, సత్తయ్యగౌడ్, నాగేంద్ర, ప్రసాద్ పాల్గొన్నారు.

చంపాపేట: ఎన్టీఆర్ జయంతి వేడుకలను టీడీపీ చంపాపేట డివిజన్ ఉపాధ్యక్షుడు బీసుకుంట్ల సంతోష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చంపాపేట గాంధీ చౌరస్తాలో ఎన్టీఆర్ చిత్రపటానికి పలువురు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బీసుకుంట్ల సంతోష్‌గౌడ్ పార్టీ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో టీడీపీ డివిజన్ మాజీ అధ్యక్షుడు మెట్టు సంజీవరెడ్డి, నాయకులు వేణుబాబు, సంతోష్‌గౌడ్, ఆరే కృష్ణ, కట్టా యాదగిరి, యాబీ.ఆనంద్‌నాయుడు, పి.వెంకటేష్, శాంతకుమార్, భరత్‌కుమార్‌గౌడ్, విజ్జు బాబు, అర్జున్‌గౌడ్, చంద్రమౌళి పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు రంగారెడ్డి, వాసు చౌదరి



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, నేలపాటి రామారావు

పెండింగ్‌లో ఉన్న హాస్టల్ భవనాల బిల్లులు చెల్లించండి

● ఎంపీ.ఆర్.కృష్ణయ్య



ఆర్.కృష్ణయ్యకు వినతిపత్రం ఇస్తున్న హాస్టల్ భవన యజమానులు

వనస్థలిపురం, మే 28(ఆంధ్రజ్యోతి): మూడు ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ హాస్టల్స్ భవనాల బిల్లులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వనస్థలిపురం, హయత్‌నగర్ డివిజన్ల ప్రభుత్వ హాస్టల్స్ భవన యజమానులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీ.ఆర్.కృష్ణయ్యను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా తమ హాస్టల్ భవనాలను ప్రభుత్వం అద్దెలు చెల్లించలేకపోవంతో తాము ఆర్థికంగా చితికిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము భవనాల ఇన్‌కమ్‌టాక్స్, ఈఎంఐలు సైతం చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు. దీని మూలంగా హాస్టళ్లను మూసివేసే పరిస్థితి వస్తుందన్నారు. కావున పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. అనంతరం ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి బిల్లుల విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, అరుణ్‌కుమార్, సాయి కుమార్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించండి

● ఆరోగ్య శాఖమంత్రి దామోదరకు వినతి



మంత్రి రాజనరసింహకు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్ తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెలిమండ్ల గోవర్ధన్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన రాష్ట్ర ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహను కలిసి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. గతంలో సదరం క్యాంపులు స్థానిక ఏరియా ఆస్పత్రుల్లో నిర్వహించే వారని తెలిపారు. కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో సదరం క్యాంపును నిలిపివేసి ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో నిర్వహిస్తున్నారని చెప్పారు. దీంతో ఆ ప్రాంతంలోని దివ్యాంగులు గాంధీ ఆస్పత్రికి వెళ్లేందుకు ట్రాఫిక్‌తో పాటు ఇతర సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు యూడీ కార్డులను ఇవ్వకపోగా సదరం క్యాంపులను కూడా నిర్వహించడం లేదన్నారు. ఏరియా ఆస్పత్రుల్లోనే సదరం క్యాంపులను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పినట్లు గోవర్ధన్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సురేష్, ప్రణీత్‌సింగ్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతం చేద్దాం



ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఉపాధి కూలీలకు పంచుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నరసింహ

అబ్దుల్లాపూర్‌మెట్, మే 28(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాలని, ఉపాధి కార్మికులకు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఏర్పుల నరసింహ పిలుపునిచ్చారు. బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని సుర్మాయిగూడ, గండిచెరువు గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల పనులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ రెండు నెలలుగా ఉపాధి కూలీలకు బిల్లులు రావడం లేదని దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉపాధి కూలీలను అవసరమైన పని ముట్లతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకానికి అదనంగా నిధులను కేటాయించడంతో పాటు 100 రోజుల పనిని 200 వందల రోజులకు పెంచుతూ రోజుకు రూ. 600 వందల కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముత్యాలు, అనూ ష, సుజాత, ఇందిర, పోచమ్మ, రాజమణి, అనిత, చంద్రకళ పాల్గొన్నారు.

ఆకలి రహిత సమాజం కోసం కృషి చేయాలి



నిరుపేదల ఆహారానికి నిధులు మంజూరు చేస్తున్న వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం, మే 28(ఆంధ్రజ్యోతి): ఆకలి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం మల్‌బార్ గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం వరల్డ్ హంగర్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజశేఖర్‌రెడ్డి మల్‌బార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ.అహ్మద్‌తో కలిసి 2025-26 సంవత్సరానికి గాను 2కోట్ల50 లక్షల మందికి ఉచిత భోజనాల కోసం రూ.150 కోట్ల సంస్థ నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకలితో ఎవరు కూడా ఇబ్బందులు పడ వద్దన్నారు. జాంబియా దేశాలతో పాటు ఇతర దేశాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని దీని కోసం తమ సంస్థ ప్రతిరోజు 70వేల మందికి ఉచితంగా భోజనాలను అందజేస్తుందన్నారు. ఆకలి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్‌బార్ గ్రూప్ వైస్ చైర్మన్ కెపి అబ్దుల్ సలాం, ఓ.అషర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాలు అపహరించిన వ్యక్తి అరెస్టు

● ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న నాగోల్ ఇన్‌స్పెక్టర్ సూర్యానాయక్, చిత్రంలో నిందితుడు

మన్సూరాబాద్, మే 28(ఆంధ్రజ్యోతి): జ్యోతిష్యం పేరుతో మహిళ వద్ద బంగారు ఆభరణాలు అపహరించిన వ్యక్తిని నాగోల్ పోలీస్‌స్టేషన్ పోలీసులు అరెస్టు చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన సినిగిరి సాయికుమార్ అలియాస్ సాయిరాజ్(33) కొంత కాలంగా బోడుప్పల్ మేడిపల్లిలో ఉంటూ జ్యోతిష్యం వృత్తి చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో నాగోల్ డివిజన్ జైపురికాలనీలో జ్యోతిష్యాలయం ఏర్పాటు చేశాడు. కాగా సదరు సాయికుమార్ ఇదే కాలనీకి చెందిన మహిళను ఇటీవల పూజల పేరుతో నమ్మించి ఆమె దగ్గర ఉన్న నల్లపూసల గొలుసు తీసుకుని పరారయ్యాడు. మోసపోయిన సదరు మహిళ చేసేదిలేక నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టి సాయికుమార్‌ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద ఉన్న నల్లపూసల గొలుసును స్వాధీనం చేసుకుని నిందుతుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్యలు అభినందిచారు.



మంత్రి సునీల్‌కు నివాళులర్పిస్తున్న ఆయన కుటుంబ సభ్యులు, బ్రాహ్మణ సంఘాల నాయకులు

మంత్రి సునీల్ సంస్మరణ సభ

మన్సూరాబాద్, మే 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర కోశాధికారి, శ్రీవైష్ణవి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు మంత్రి సునీల్ ద్వాదశ దినకర్మ, సంస్మరణ సభ బుధవారం బండ్లగూడలోని సహభావన అపార్ట్‌మెంట్స్‌లోని వారి నివాసం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ కుటుంబ సభ్యులతో పాటు వివిధ బ్రాహ్మణ సంఘాల నాయకులు, పెద్దలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ బ్రాహ్మణ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వింజమూరి సుధాకర్, తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు మాట్లాడుతూ మంత్రి సునీల్ లేకపోవడం శ్రీవైష్ణవి ట్రస్టుకు, బ్రాహ్మణ సంఘాలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాణాల శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి చెన్నూరి లక్ష్మీనరసింహారావు, దేవులపల్లి రంగారావు, పోచంపల్లి మోహన్‌రావు, అక్కిరాజు దుర్గాప్రసాద్, ఊరే ప్రసాదరావు, దానం రామేశ్వరరావు, గంప రామశర్మ, దేవులపల్లి అశోక్‌కుమార్, వెంకట్రావు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

డ్యూటీకి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



తిరుమలేష్

హయత్‌నగర్, మే 28(ఆంధ్రజ్యోతి): పదహారు రోజుల క్రితం డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన భర్త అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌లో నివాసం ఉండే కోవాకుల తిరుమలేష్(43) ము షీరాబాద్ ఆర్టీసీ డిపోలో బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా మే 12వ తేదీన తెల్లవారు జామున 3.30గంటలకు డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి తిరిగిరాకపోవడంతో భార్య వరలక్ష్మి మరుసటి రో జు బస్సు డిపో వద్దకు వెళ్లి తిరుమలేష్ గురించి విచారించింది. అయినా అతని ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె బంధువుల వద్ద, కుటుంబ సభ్యుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో బుధవారం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్క్ చేసిన వాహనాలను ఢీకొట్టిన కారు

సంతోష్‌నగర్, మే 28(ఆంధ్రజ్యోతి): వేగంగా దూసుకు వచ్చిన కారు బీభత్సం సృష్టించిన సంఘటన ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మిలాద్ రోడ్డులో వేగంగా దూసుకు వచ్చిన ఇన్నోవా కారు రోడ్డు పక్కన పార్క్ చేసిన మూడు వాహనాలను ఢీకొట్టింది. ఆ సమయంలో వాహనాల వద్ద ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కారు వేగం దాటికి వాహనాలు దెబ్బతిన్నాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని జేసీబీ సాయంతో ఇన్నోవా కారును రోడ్డుపై నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లు నిర్మించుకుంటున్న వారిపై దౌర్జన్యం

● పోలీసులకు ఫిర్యాదు, కేసు నమోదు

చాదర్‌ఘాట్, మే 28(ఆంధ్రజ్యోతి): 60 చదరపు గజాల స్థలంలో ఇల్లు నిర్మించుకుంటున్న కుటుంబీకులపై కొంత మంది వ్యక్తులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. నిర్మించుకుంటున్న ఇంటిని తమకే అమ్మాలంటూ బెదిరించడంతోపాటు దౌర్జన్యానికి పాల్పడడంతో బాధిత కుటుంబీకులు సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబీకులు, సరూర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీలోని తన 60 చదరపు గజాల స్థలంలో ఇళ్లు నిర్మించుకుంటుండగా ఇదే కాలనీకి చెందిన రవీందర్, ఆంజనేయులు, వెంకటేశ్‌తో పాటు మరికొందరు ఈ స్థలాన్ని తమకు అమ్మాలంటూ అడ్డుకున్నారు. ఇంటి నిర్మాణ పనులను అడ్డుకుంటూ తమ కుటుంబీకులపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారంటూ స్థలం యజమాని బి.పద్మ సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వేధింపులు భరించలేకనే హత్య !

● మర్డర్ కేసులో నిందితురాలు స్టేట్‌మెంట్ రికార్డు చేసిన పోలీసులు

వనస్థలిపురం, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు తాగి వచ్చి వేధించడమే కాకుండా, అక్రమ సంబంధాలు అంటగట్టి నిత్యం ఇబ్బందులకు గురిచేస్తుండటంతో వేధింపులు భరించలేకనే తన భర్తను క్షణికావేశంలో హత్య చేయాల్సి వచ్చిందని నిందితురాలు శిరీష పోలీసులకు వెల్లడించింది. మంగళవారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన కిషన్‌నాయక్ మర్డర్ కేసులో అతని భార్య శిరీషను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఆమెను విచారించిన క్రమంలో తన భర్తను తానే హత్యచేసినట్లు పోలీసుల ఎదుట ఒప్పుకున్నట్లు సమాచారం. హత్యకు సంబంధించిన ఆధారాలతో పాటు టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించిన పోలీసులు నిందితురాలు శిరీషను గురువారం రిమాండ్‌కు తరలించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.